తెలంగాణ ప్రభుత్వం

# బడ్జెట్ ప్రసంగం

# 2015–16

ఈటల రాజేందర్

ఆర్థిక మంత్రి

# 2015, మార్చి 11వ తేదీన తెలంగాణ రాష్ట్ర శాసనసభకు 2015-16 సంవత్సరం బడ్జెట్‌ను సమర్పిస్తూ గౌరవనీయులైన ఆర్థిక మంత్రి శ్రీ ఈటల రాజేందర్ ప్రసంగం.

*గౌరవనీయ అధ్యక్షా!*

1. నేడు తెలంగాణ రాష్ట్రంలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అద్భుతమైన అవకాశం ఆర్థిక మంత్రిగా నాకు కలిగినందుకు గర్విస్తు న్నాను. అధ్యక్షా! తెలంగాణ కొత్త రాష్ట్రం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అణగారిన తెలంగాణ ప్రజలు సుదీర్ఘకాలం పోరాడి సాధించుకున్న రాష్ట్రం. గతం మిగిల్చిన అన్యాయాల అవశేషాలు, కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో ఉండే ప్రారంభ సమస్యలు, బలాలు, బలహీనతలు, ఆటంకాలు, అవరోధాలు, కేంద్ర సాయం పై అందని అంచనాలు ఇన్ని పరిమితులను అధిగమిస్తూ 2014-15 సంవత్సరం పది నెలల కాలానికి, ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేటట్టు సాహసోపేతమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం నాకు దక్కింది. ఆ బడ్జెట్ ప్రజల మన్నన పొందింది. పరిపాలనలో మా మార్గమేమిటో, మాకు ప్రజల సంక్షేమంపట్ల, అభివృద్ధి పట్ల ఉన్న పట్టింపేమిటో తెలంగాణ ప్రజలకు వెల్లడైంది. ఈ రోజు నేను ప్రవేశపెడుతున్నది పూర్తి అవగాహనతో, స్పష్టతతో, సమన్వయంతో రూపొందించిన 2015-16 సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్. ఈ రెండు బడ్జెట్‌లను ప్రవేశపెట్టే అరుదైన గౌరవాన్ని నాకు కల్పించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారికి హృదయపూర్వక

ధన్యవాదాలు. వారి సమగ్ర దృక్పథం, దార్శనికత అందించిన వెలుగులోనే బడ్జెట్ రూపొందిందని తమ ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

2. అధ్యక్షా! బడ్జెట్ అంటే చిట్టా పద్దుల పట్టిక కాదు. జీవం లేని అంకెలు, సారం లేని గణాంకాలు కాదు. The Budget is not just a collection of numbers, but an expression of our values and aspirations.

3. బడ్జెట్ అంటే తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, వారి కళ్ళల్లో తొణికిసలాడుతున్న కలలు. వారి ఆశలని ఆకాంక్షలని నిజం చేసే నిర్మాణాత్మకమైన ప్రణాళిక. ప్రజాధనాన్ని ప్రజల నిజమైన అభివృద్ధి కోసం వెచ్చించే గంభీరమైన, బాధ్యతాయుతమైన ప్రక్రియ. ఈ బడ్జెట్ తెలంగాణ నెలకొల్పిన సామాజిక విలువల ఆధారంగా రూపొందించిన సజీవ ఆర్థిక ప్రణాళిక అని తమరి ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా!

4. ఇటీవల 14వ ఆర్థిక సంఘం నివేదిక ఒక చారిత్రిక సత్యాన్ని ఋజువు చేసింది. దేశంలో గుజరాత్, తెలంగాణ రెండు రాష్ట్రాలను మిగులు (Revenue Surplus) రాష్ట్రాలుగా గుర్తించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆర్థిక లోటు ఎదుర్కొంటున్న రాష్ట్రంగా ప్రకటించింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ నిధులు మళ్ళింపుకు గురైనాయని, ఉద్దేశ్యపూర్వకమైన వివక్షే తెలంగాణ ఉసురు తీసిందని ఈ నివేదిక పరోక్షంగా మరోసారి రుజువు చేసింది. అధ్యక్షా! నేడిది తెలంగాణ రాష్ట్రం. తెలంగాణ ప్రజలు

స్వాభిమానంతో తమ భవిష్యత్తును తామే నిర్మించుకునే సత్తాపొందిన స్వరాష్ట్రం. ఇవాళ ఈ నేల మీద ఉత్పత్తి అయ్యే సంపదా, ఇక్కడి ప్రజలు చెమటోడ్చి సృష్టించిన ప్రతిపైసా తెలంగాణ ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసమే వెచ్చించే చారిత్రాత్మకమైన గొప్ప అవకాశం అధికారం మనం సాధించుకొన్నాం. ఇది గౌరవ ముఖ్యమంత్రి గారి మహోన్నత నాయకత్వంలో తెలంగాణ ప్రజలు సృష్టించిన అపూర్వమైన సందర్భమని సభ్యులకు విన్నవించుకొంటున్నాను.

5. ఎవరైతే కాయలు కాసిన భుజాల మీద ఉద్యమ భారాన్ని మోసినారో, ఎవరైతే క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి ఆకాంక్షలను అవసరాలను అర్థం చేసుకున్నారో, ఎవరు ప్రజలను ఒక్క తాటిమీద నడిపించినారో, ఎవరు త్యాగాలకు వెనుదీయకుండా యుద్ధరంగంలో ముందుండి నడిచినారో, ఎవరు పోరాటాన్ని విజయతీరానికి చేర్చి గమ్యాన్ని ముద్దాడినారో, వారి నేతృత్వంలోనే ఏర్పడిన ప్రభుత్వం తెలంగాణను ఆశించిన స్థాయిలో అభ్యుదయ పథంలో నడిపించేందుకు నిజాయితీగా రూపొందించిన ఆర్థిక ప్రణాళికల సారం ఈ బడ్జెట్. తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకోసం అట్టడుగు వర్గాల నిజమైన అభివృద్ధికోసం రూపొందించిన పథకాల సమాహారమే ఈ బడ్జెట్.

6. గత పది నెలల తాత్కాలిక బడ్జెట్‌లోనే తెలంగాణ ప్రభుత్వం అనేక ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేసింది. బడ్జెట్‌లో ప్రతిపాదించినట్లుగా 481 మంది తెలంగాణా అమర వీరులకు 48.10 కోట్లు సహాయంగా

అందించింది. తెలంగాణ సాధనలో తమ ప్రాణాలు తృణప్రాయంగా ధారవోసిన అమర వీరులకు ఈ సందర్భంగా జోహార్లు పలుకుతూ వారి త్యాగం ముందు వినమ్రంగా తలవంచి నివాళులర్పిస్తున్నాను. ఎన్నికల సమయంలోనూ, ఆ తర్వాత ప్రభుత్వ ప్రాధాన్యతలలో హామీ పడ్డట్టుగానే ఎన్ని కష్టాలున్నప్పటికీ, 35,56,678 రైతులకు సంబంధించిన 17,000 కోట్ల రూపాయలలో 2014-15 సంవత్సరంలో 4,250 కోట్ల రూపాయల పంట రుణాలు మాఫీ చేశాము. అంతేకాక, 16,214.52 కోట్ల రూపాయల కొత్త ఋణాలు 31,24,375 రైతులకు బ్యాంకుల ద్వారా ఇప్పించింది మా ప్రభుత్వం. తెలంగాణ రైతాంగానికి ఎంతోకాలంగా న్యాయంగా రావలసిన ఇన్‌పుట్ సబ్సిడీ 480.43 కోట్ల రూపాయలు ఒకే విడతలో చెల్లించి మా ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు కట్టుబడిన ప్రభుత్వం అని నిరూపించుకుంది. అదే విధంగా ఎర్ర జొన్న రైతులకు న్యాయంగా చెల్లించాల్సిన 11.50 కోట్ల రూపాయల బకాయిలను కూడా చెల్లించాం. షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల, ఔత్సాహిక పారిశ్రామివేత్తలకు 3 సంవత్సరాలుగా చెల్లింపజాలని బకాయిలు రూ.484 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. 33,15,000 నిరుపేద కుటుంబాలకు ఆసరా పింఛన్లు ఇచ్చింది. 11 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా 2045 కోట్ల రూపాయల గత సంవత్సరపు స్కాలర్ షిప్ బకాయిలు ప్రభుత్వం చెల్లించింది. ఇంతే గాక, పలు క్రొత్త పథకాలు పెళ్ళికాని ఆడబిడ్డల కోసం కల్యాణ లక్ష్మి, భూమిలేని నిరుపేద షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల రైతులకోసం భూమి కొనుగోలు పథకం, మిషన్

కాకతీయ, వాటర్ గ్రిడ్‌లకు రూపకల్పన చేసి వాటిని అమలు చేయడానికి నిధులను సమకూర్చింది. ప్రాధాన్యత క్రమములో సంక్షేమానికి మా ప్రభుత్వం ప్రథమ స్థానం ఇచ్చింది. ఇంతే కాకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లోవున్న అన్ని సవాళ్లను పరిష్కరించే విధంగా రాష్ట్ర బడ్జెట్‌ను ఏర్పాటు చేసి ఖర్చు చేయడం ప్రారంభించింది. తెలంగాణా రాష్ట్రంలోని రోడ్లు గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ప్రతిబింబాలు. వీటినన్నింటినీ తక్షణమే బాగుచేయడానికి మా ప్రభుత్వం రోడ్లు మరియు భవనాల శాఖకు 11098.33 కోట్ల రూపాయలను, పంచాయతీ రాజ్ శాఖకు 3,722 కోట్ల రూపాయలను మంజూరు చేసి పనులు ప్రారంభించింది.

7. దీనితో పాటుగా మండల కేంద్రాలను మరియు జిల్లా కేంద్రాలను కలిపే రోడ్లను భవిష్యత్ అవసరాలను తీర్చేవిధంగా 2 మరియు 4 లైన్ల స్థాయికి పెంచుటకు నిర్ణయించాము. తెలంగాణ రాష్ట్రాన్ని అత్యంత దీనస్థాయికి దిగజార్చినటువంటి విద్యుత్ రంగాన్ని సంస్కరించేందుకు తొలి అడుగులు పడ్డాయి.

8. నిర్లక్ష్యానికి గురయిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను అభివృద్ధి చేసే క్రమంలో 400 కోట్ల రూపాయలను మంజూరు చేశాము. కొత్త బస్సులు కొనుగోలు చేయడమే కాకుండా సంస్థాగత సమస్యలన్నింటినీ పరిష్కరించే ప్రక్రియ మొదలయింది.

9. గతంలో కేంద్ర గ్రాంట్ల తీరును బట్టి, 2014-15 సంవత్సరపు కేంద్ర బడ్జెట్‌ను అనుసరించి రాష్ట్ర బడ్జెట్‌లో కేంద్ర గ్రాంట్ల అంచనాలు

చేర్చాము. కాని కేంద్రం నుండి రావాల్సిన నిధులు బాగా తగ్గాయి. అంచనాల ప్రకారం అవి అంది ఉంటే రాష్ట్ర ఆదాయ వ్యయాలను మరింత సమర్థవంతంగా నిర్వహించగలిగేవాళ్ళం. రాష్ట్ర బడ్జెట్‌లో 2014-15 సంవత్సరానికి కేంద్రం నుండి రావల్సిన ప్రణాళికా సహాయం 11,781 కోట్ల రూపాయలు. కాని 2015 ఫిబ్రవరి వరకు కేవలం 4,147 కోట్ల రూపాయల నిధుల సహాయం మాత్రమే అందింది. కేంద్రం నుండి అందాల్సిన ప్రణాళికేతర గ్రాంట్లు రూ.9,939 కోట్ల రూపాయలలో 2015 ఫిబ్రవరి నెల వరకు కేవలం 1,346 కోట్ల రూపాయలు మాత్రమే అందాయి. అంటే ప్రతిపాదించిన మొత్తంలో 14 శాతం మాత్రమే అందాయి. ఎఫ్.ఆర్.బి.ఎమ్. (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జట్ మేనేజ్ మెంట్) చట్టం కింద కొంతమేర అప్పు తెచ్చుకొనే అవకాశం రాష్ట్రాలకు ఉంటుంది. అలా అప్పు తెచ్చుకునే పరిమితిని సడలించి మరో 4,000 కోట్ల రూపాయలు అప్పు తెచ్చుకొనేందుకు రాష్ట్రానికి అవకాశం కల్పించాలని భారత ప్రభుత్వాన్ని కోరాము. అప్పు పరిమితిని సడలించే అంశంపై కేంద్రం నుండి ఇంతవరకు ఏ సమాధానమూ రాలేదు. కేంద్రం నుండి రావాల్సిన ప్రణాళిక, ప్రణాళికేతర నిధుల్లో తరుగు, సి.ఎస్.టి. పరిహారం మరియు ప్రత్యేక ఆర్థిక సహాయం రాకపోవడం, ఋణ పరిమితి పెంపును సడలించక పోవడం వంటివి అన్నీ కలిపితే మన ఆదాయ వనరుల్లో 20,227 కోట్ల రూపాయల లోటు ఏర్పడుతున్నది. ఈ లోటుకు కారణమైన అంశాలేవీ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనివి కావు.

దానికి తోడు కేంద్ర ప్రణాళికా నిధుల కేటాయింపుపై రాష్ట్రానికి చాలా ఆలస్యంగా 2015 ఫిబ్రవరి చివరిలో సమాచారం అందింది.

10. వ్యాట్, భూమి క్రమబద్ధీకరణలు మినహా 2014-15లో సమర్పించిన ఓన్-టాక్స్ (SOTR), ఓన్-నాన్ టాక్స్ (NTR) ఆదాయాలు దాదాపుగా గాడిలో ఉన్నాయి. భూమి క్రమబద్ధీకరణ పథకానికి ప్రజల నుండి మంచి స్పందన వచ్చింది. ఈ పథకంలో భాగంగా 3.36 లక్షల ధరఖాస్తులు వచ్చాయి. గౌరవ ముఖ్యమంత్రి గారి అధ్యక్షతన నిర్వహించిన అఖిల పక్ష సమావేశ నిర్ణయాల మేరకు, 125 చదరపు గజాలలోపు ప్లాటు గలవారికి తమ ప్లాట్లు క్రమబద్ధీకరించుకునేందుకు ఎటువంటి రుసుము/జరిమాన చెల్లించనక్కరలేదని ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. ఇటు వంటి చిన్న ప్లాట్లలో ఉన్నవారు పేదవారై ఉంటారన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. పేద ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ విధానము. ఒక అంచనా ప్రకారం క్రమబద్ధీకరణ ఫలితంగా పేదలకు కనీసపక్షం ముప్పై వేల కోట్ల ప్రయోజనం చేకూరుతున్నది. భూమిపై అధికారిక యజమాన్యం లేక, అమ్మలేక, కొనలేక అనిశ్చితిలో ఉన్న లక్షల మందికి ఇది ఊరట. పేదల సంక్షేమంతో పాటు అనిశ్చితికి తెరదించడానికి భూమి క్రమబద్ధీకరణ ఒక విప్లవాత్మక ముందంజ.

11. అఖిల భారత సర్వీసు అధికారులను రాష్ట్రానికి కేటాయించడంలో తీవ్ర జాప్యం జరిగింది. తుది కేటాయింపులు గత వారంలో మాత్రమే

జరిగినాయి. రాష్ట్ర స్థాయి సిబ్బంది విభజన కూడా ఇంకా పూర్తి కాలేదు. ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్.లు, ఇతర సిబ్బంది తక్కువగా ఉండడం వలన కొత్త రాష్ట్రంలో విధుల నిర్వహణ కష్ట తరంగా మారింది. సిబ్బంది కొరత వల్ల ఒక్కో అధికారి రెండు మూడు శాఖలను నిర్వహించాల్సి వచ్చింది. దీనివలన ప్రభుత్వం నిర్ణయాలను తీసుకోవడంలో అమలు చేయడంలోనూ జాప్యం జరిగింది. ఎన్ని ఇబ్బందులు ఉన్నా అతి తక్కువ సమయంలో అవసరమైన అన్ని చోట్లా సిబ్బందిని నియమించ గలిగాము. కార్య నిర్వాహక యంత్రాంగాన్ని గాడిలో పెట్టగలిగాము. ఇందుకు సహకరించిన అధికారులను వారి వెన్నంటి ఉన్న సిబ్బంది అందరినీ ఈ సందర్భంగా సభాముఖంగా అభినందిస్తున్నాను. 2014-15 సంవత్సర బడ్జెట్ తయారీలో కూడా ఈ కారణాల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురైన వాస్తవాన్ని గౌరవ సభ్యులు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి. కొత్త రాష్ట్ర నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను మనసులో పెట్టుకొని మాత్రమే ప్రభుత్వ నిర్వహణా తీరు గురించి ఒక అంచనాకు రావాలని గౌరవ సభ్యులను కోరుతున్నాను. ప్రజల అవసరాలను, ప్రాధాన్యతలను గుర్తెరిగి ఇంత తక్కువ సమయంలోనూ చురుకుగా నిర్ణయాలు తీసుకుని ప్రజాపాలనను గాడిన పెట్టిన ఘనత మన రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుంది.

12. తెలంగాణకు ఉన్న ఆదాయ వనరులను ఇతర ప్రాంతాలకు మళ్లించడం వల్ల తెలంగాణ తిరోగమనం పాలయ్యింది. తెలంగాణకు ఎంతో ఆదాయం ఉన్నా, దానిని ఇక్కడ వ్యయం చేయలేదు. తెలంగాణ వనరుల వాటా కంటే, వ్యయం వాటా చాలా తక్కువగా ఉండేది. కేంద్ర

ప్రభుత్వం నియమించిన లలిత్ కమిటీ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను సైతం పక్కన పెట్టి నిరాటంకంగా నిధుల మళ్లింపు కొనసాగించారు. తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటాను ఉమ్మడి రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు ఖర్చు చేశారు. నిధుల కేటాయింపుల్లో దారుణంగా అన్యాయం జరిగిందన్న టీ.ఆర్.ఎస్. వాదన అక్షరాలా నిజమని 14వ ఆర్థిక సంఘం నివేదిక తేటతెల్లం చేస్తున్నది. ఇది గతం. ఇకనుంచి మన ప్రభుత్వంలో మన నిధులు మనకే. ఒక నాడు రాజుల సొమ్ము రాళ్ల పాలయ్యింది. ప్రజల సొమ్ము పాలకుల పాలయ్యింది. కాని ఇక నుంచి ప్రజల సొమ్ము ప్రజలకే. తెలంగాణ ప్రజల సొమ్ము తెలంగాణ ప్రజలకే చెందుతుంది.

13. ఆర్థిక సంఘం అనేది రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థ. 14వ ఆర్థిక సంఘం తన నివేదికను ఇటీవలే భారత రాష్ట్రపతికి సమర్పించింది. 2015-16 నుండి 2019-20 వరకు అయిదు ఏండ్ల కాలానికి వివిధ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పంపకం చేయనున్న పన్నుల వాటాను, మంజూరు చేయనున్న నిధుల వివరాలను ఇందుకు ఆర్థిక సంఘం అనుసరించిన విధి విధానాలను ఈ నివేదికలో వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆదాయ వ్యయాల ధోరణిని బట్టి వేసిన అంచనా ప్రకారం, 2015-16 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ తలసరి సొంత ఆదాయం 11,872 రూపాయలు కాగా, రెవిన్యూ వ్యయం 18,281 రూపాయలు. మరోవైపు తెలంగాణ రాష్ట్రం తలసరి సొంత ఆదాయం 16,274

రూపాయలు కాగా, రెవిన్యూ వ్యయం 16,042 రూపాయలు మాత్రమే. తెలంగాణలోని మిగులు ఆదాయ వనరులను ఆంధ్రప్రదేశ్‌కు మళ్లించి ఖర్చు చేశారన్నది దీనివల్ల స్పష్టం అవుతున్నది. ఇప్పుడు ఇది మన రాష్ట్రం. మన తెలంగాణ. ఆదాయ వ్యయాలు మన చేతుల్లోనే ఉన్నాయి. ఆదాయ వనరులను సద్వినియోగం చేసుకొంటూ ప్రజలకు భవిష్యత్తుపై భరోసాను కల్పించే సదవకాశం వచ్చింది. చారిత్రక తప్పిదాలను సరిదిద్దే అవకాశం ఇది. మన ఆవశ్యకతలను దృష్టిలో పెట్టుకొని నవ తెలంగాణను ఆవిష్కరించేందుకు సామాజిక, ఆర్థిక పునర్ నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చాము.

14. రాష్ట్ర బడ్జెట్ సమర్పించడానికంటే ముందు, గౌరవ సభ్యులకు, మన రాష్ట్ర స్థూల ఆర్థిక స్థితి గతులను వివరించడం సముచితం అని నేను భావిస్తున్నాను. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి 2011-12 సంవత్సరం నుండి కుంటుపడింది. 2004-09 సంవత్సరాలలో 12.87 శాతంగా ఉన్న సగటు వార్షికాభివృద్ధి 2012-13 నాటికి 4.1 శాతానికి పడిపోయింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో 5.3 శాతం ఆర్థికాభివృద్ధి ఉండవచ్చునని అంచనా. ఋతుపవనాలు ఆలస్యంగా రావడం, వర్షపాతం తక్కువగా ఉండడం వ్యవసాయ రంగాన్ని నిస్తేజం చేసాయి. నైరుతి ఋతుపవనాల వల్ల కురిసిన వర్షాలు, సాధారణ వర్షపాతం కంటే 30 శాతం తక్కువగా కురిసాయి. గత సంవత్సరం కురిసిన వర్షాలతో పోల్చితే ఇది సగం కూడా కాదు (42 శాతం). కాలం కలిసి రానందువల్ల వ్యవసాయ రంగం అనుకున్నంత పుంజుకోలేదు. ఈ రంగం అభివృద్ధి పదిశాతం

తగ్గిపోయింది. పారిశ్రామిక, సేవారంగాలు నిలదొక్కుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో మన ఆశలకు జీవంపోస్తున్నది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలలో సేవా, పారిశ్రామిక రంగాలదే ప్రధాన వాటా. సేవా రంగంలో అభివృద్ధి గత సంవత్సరం (2013-14) 5.3 శాతం కాగా, 2014-15 సంవత్సరంలో అది 9.7 శాతానికి పెరిగింది. పారిశ్రామిక రంగంలో అభివృద్ధి గత సంవత్సరం 0.1 శాతం కాగా ఈ ఏడు అది 4.1 శాతానికి చేరింది. జాతీయ స్థాయిలో ఆర్థిక రంగ పురోగమనానికి తోడు రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల 2015-16 సంవత్సరంలో ఆర్థికవృద్ధి ఆశాజనకంగా ఉండగలదని భావిస్తున్నాను.

15. బడ్జెట్ రూపకల్పనలో అన్ని నిర్ణయాలకూ తెలంగాణా రాష్ట్ర ప్రజల శ్రేయో సంక్షేమాలే గీటురాయి. ఈ స్ఫూర్తి తోనే ప్రభుత్వం మూడు ప్రాథమ్యాలను గుర్తించింది. ఇందులో మొట్టమొదటిది బలహీన వర్గాల సంక్షేమం. మన జనాభాలో ఎక్కువ మంది ఆధారపడి ఉన్న రంగం వ్యవసాయ రంగం. వ్యవసాయ అనుబంధరంగాల వికాసం రెండవది. పారిశ్రామిక రంగ అభివృద్ధి మూడవది. ఈ మూడు, ప్రాథమ్యాలు మాత్రమే కాదు, మా ప్రభుత్వ సిద్ధాంతాలు కూడా. గడిచిన తొమ్మిది నెలల స్వల్ప కాలంలో ఈ ప్రాథమ్యాలకనుగుణంగా మా ప్రభుత్వం ఏం చేసింది, వచ్చే సంవత్సర కాలంలో ఏంచేయాలనుకుంటున్నది క్లుప్తంగా వివరిస్తాను.

## సంక్షేమ కార్యక్రమాలు

## షెడ్యూల్డు కులాల సంక్షేమం

16. రాష్ట్ర జనాభాలో షెడ్యూల్డు కులాలవారు 15.4 శాతం ఉన్నారు. వారంతా కడు పేదరికంలో మగ్గుతున్నారు. 'దళితుల ఆర్థికాభివృద్ధికి సాధికారతకు సాగుభూమి ఎంతగానో దోహదపడుతుంది' అన్న అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా షెడ్యూల్డు కులాల ప్రజల్లో పేదరికాన్ని రూపుమాపడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపట్టిన విషయం గౌరవ సభ్యులకు తెలుసు. వ్యవసాయంపై ఆధారపడిన నిరుపేద షెడ్యూల్డు కులాల వారికి, కుటుంబానికి మూడు ఎకరాల చొప్పున సాగుకు యోగ్యమైన భూమిని పంపిణీ చేయాలన్నది మా ప్రభుత్వ లక్ష్యం. పేద షెడ్యూల్డు కులాల కుటుంబాలకు సాగు భూమి పంపిణీ అనేది దశల వారీగా అమలు చేస్తాము. ఈ పథకంలో లబ్దిదారు ఎటువంటి సొమ్ము చెల్లించనక్కరలేదు. బ్యాంకు లింకేజి లేదు. హైదరాబాదు మినహా తొమ్మిది జిల్లాలలో పంపిణీకి యోగ్యమైన సాగు భూమిని కొనుగోలు చేసే అధికారాన్ని ఆయా జిల్లా కలెక్టర్లకు ఇచ్చాము. ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ.7 లక్షల విలువైన సాగు భూమిని కొనాలని సూచిస్తున్నాము. 2015 జనవరి దాకా రాష్ట్ర వ్యాప్తంగా 1,132 ఎకరాల ప్రైవేటు భూమిని, 270 ఎకరాల ప్రభుత్వ భూమిని 525 కుటుంబాలకు పంపిణీ చేశాము. 2015-16 సంవత్సర కాలంలో ఈ పథకాన్ని మరింత బలోపేతం చేయడానికి 1,000 కోట్ల రూపాయలు ప్రతిపాదించినాము. ఈ పథకం అమలులో, గత సంవత్సరం

కొన్ని అవాంతరాలు ఎదుర్కొన్నాము. ముఖ్యంగా సాగు యోగ్యమైన భూమిని గుర్తించడంలో సమస్యలు ఎదురయ్యాయి. అన్ని సమస్యలను అధిగమించి ఈ ఏడు ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు తగు జాగ్రతలు తీసుకుంటున్నాము.

17. స్వతంత్రంగా ఉపాధి అవకాశాలు ఎంచుకొనేందుకు గాను షెడ్యూల్డు కులాల యువతలో నైపుణ్యాభివృద్ధికై శిక్షణను ఇస్తున్నాం. వారికి సాంకేతిక శిక్షణను ఇవ్వడమే కాక, ఉపాధి అవకాశాలను కూడా చూపే సంస్థలను గుర్తిస్తాం. షెడ్యూల్డు కులాల సంక్షేమం కోసం 2015-16 వార్షిక ప్రణాళికలో 5,547 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాం.

## షెడ్యూల్డు తెగల సంక్షేమం

18. మా ప్రభుత్వ లక్ష్యాల్లో ముఖ్యమైనది గిరిజన సంక్షేమం. 2014-15 బడ్జెట్ ప్రసంగంలో చెప్పినట్లే, గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మైదాన ప్రాంత గిరిజనుల కోసం ఐ.టి.డి.ఏ. తరహాలో పథకాలు అమలు చేసేందుకు కూడా చర్యలు తీసుకున్నాం. గౌరవ ముఖ్యమంత్రి గారు అదిలాబాద్ జిల్లాలో కొమురం భీమ్ అమరత్వం పొందిన జోడే ఘాట్ గ్రామాన్ని స్వయంగా సందర్శించి స్మారక ప్రదేశంగా అభివృద్ధి చేసేందుకు ఈ గ్రామంలో శంఖుస్థాపన కూడా చేసారు. స్మారక ప్రదేశం అభివృద్ధికి 25 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా.

19. గిరిజన సంక్షేమానికి 2015-16 వార్షిక ప్రణాళికలో లో 2,878 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను.

## షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల ఉపప్రణాళిక

20. జనాభా ప్రాతిపదికన షెడ్యూల్డు కులాల మరియు తెగల ఉపప్రణాళికలకు నిధులు కేటాయిస్తున్నం. ఆయా వర్గాలకు సమర్థవంతంగా నిధులు వ్యయం చేయాలన్నది మా ప్రభుత్వ సంకల్పం. గతంలో పలు ఇతర శాఖల ద్వారా ఈ వర్గాలకు నిధుల కేటాయింపు జరిగేది. కాని ఈ బడ్జెట్ సంవత్సరం నుండి ఆయా వర్గాలకు ఉద్దేశించిన నిధులు షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ, షెడ్యూల్డు తెగల సంక్షేమ శాఖలకు నేరుగా కేటాయించాలని నిర్ణయించాం. ఈ కేటాయింపులు షెడ్యూల్డు కులాల మరియు తెగల సంక్షేమం వికాసానికి మా ప్రభుత్వ నిబద్ధతను చాటుతాయి. బడ్జెట్ కేటాయింపుల్లో ఈ మార్పువల్ల నిధుల పర్యవేక్షణ వినియోగాలలో సంబంధిత సంక్షేమ శాఖలకు తగు వెసులుబాటు కలుగుతుంది. ఆ శాఖలు తమ ప్రాధాన్యతలను బేరీజు వేసుకొని, తమకు కేటాయించిన నిధులను తగు విధంగా పునఃపంపిణీ చేసేందుకు అవకాశం కలుగుతుంది. 2015-16 బడ్జెట్‌లో షెడ్యూల్డు కులాల ఉపప్రణాళికకు 8,089 కోట్ల రూపాయలను, షెడ్యూల్డు తెగల ఉపప్రణాళికకు 5,036 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాను. మా ప్రభుత్వం తీసుకున్న మరొక ముఖ్యమైన చర్య తెలంగాణా రాష్ట్రంలోని షెడ్యూల్డు తెగల జనాభా పెరుగుదలను, వారి యొక్క సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసి, ''వాల్మీకి బోయ'' మరియు

‘‘కాయితీ లంబాడా’’ కులాల్ని షెడ్యూల్డు జాతుల జాబితాలో చేర్చడం కోసం వారి నుంచి అందిన విజ్ఞప్తుల్ని అమూలాగ్రం పరిశీలించి ఒక సమగ్ర నివేదికను ఇవ్వడానికి ఒక విచారణ సంఘాన్ని ఏర్పాటు చేసినం. అదేవిధంగా, సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా గిరిపుత్రులలో నూతనోత్సాహాన్ని నింపి వారి అభివృద్ధి తోడ్పాటుకు రూ.ఒక కోటిని మంజూరు చేసినాం. బంజారాహిల్స్‌లో ఇప్పుడు బంజారాల జాడే కరువయ్యింది. బంజారాల అభ్యున్నతి కోసం వారికి అన్ని అవసరాలకూ ఉపయోగ పడేలా ఇదే బంజారాహిల్స్‌లో భవనాన్ని నిర్మించడానికి మా ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. గిరిపుత్రులయిన బంజారాల ఆత్మగౌరవానికి పట్టం కట్టింది. అదే విధంగా ఆదివాసి భవన శంకుస్థాపన కూడా చేసినాం. ఆదివాసీల పట్ల మాకున్న నిబద్ధతను చాటుకున్నాం.

## వెనుకబడిన తరగతుల సంక్షేమం

21. రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతుల జనాభా అధికం. వారి సంక్షేమం కోసం, వెనకబడిన తరగతుల విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంటు చేస్తున్నాము. వెనుకబడిన విద్యార్థి వసతిగృహాల్లో సౌకర్యాలను మెరుగు పరచేందుకు తగు చర్యలు తీసుకున్నాము. ‘‘మహాత్మ జ్యోతి రావు ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ ఆవాస విద్యా సంస్థల సంఘం’’ రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల్లో ఆవాస విద్యను ప్రోత్సాహించేందుకు కృషి చేస్తుంది. వెనుకబడిన తరగతుల్లోని వివిధ కులాలకు సేవలందిస్తున్న సహకార, ఆర్థిక సంఘాలకు

తగినన్ని నిధులు కేటాయిస్తున్నాము. వివిధ అభివృద్ధి పథకాలు వెనుకబడిన తరగతుల లబ్దిదారులకు ప్రాధాన్యత ఉండేలా తగు చర్యలు తీసుకొంటున్నాం. 2015-16 బడ్జెట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమానికి 2,172 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము. వ్యవసాయమే ముఖ్య ఆలంబనమై ఉన్న వెనుకబడిన జాతుల వారి సముద్ధరణ కోసం సూక్ష్మ సేద్యం వంటి ప్రణాళికల లో ప్రత్యేక కేటాయింపులు చేయడమైనది.

## మైనారిటీ సంక్షేమం

22. మైనారిటీ సంక్షేమం మా ప్రభుత్వ ప్రాథమ్యం. గడిచిన తొమ్మిది నెలల పాలనలో మైనారిటీల సంక్షేమం మరియు వికాసం కోసం అనేక చర్యలు తీసుకున్నాము. అధ్యక్షా! తెలంగాణ రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీలు ఆర్థిక, సాంఘిక, విద్యా రంగాలలో ఎదుర్కొంటున్న స్థితిగతుల్ని అద్యయనం చేసి వారిని ఇతర సామాజిక వర్గాలతో సమాన స్థాయికి తీసుకురావటానికి ఒక సమగ్ర నివేదికను సమర్పించడానికి ఈ మధ్యనే శ్రీ జి. సుధీర్, ఐ.ఎ.ఎస్.(రిటైర్డు), అధ్యక్షతన ఒక కమిటీని మా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని సభకు తెలియజేయడానికి నేను సంతోషిస్తున్నాను. హైదరాబాదు నగరంలో క్రిస్టియన్ భవన్ నిర్మాణానికి ప్రభుత్వ భూమి కేటాయించడంతో పాటు పది కోట్ల రూపాయలను మంజూరు చేశాము. క్రిస్టియన్ భవన్‌లో సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు యువతకు పలు అంశాలలో శిక్షణ ఇచ్చేందుకు కూడా తగు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గా

దగ్గర అయిదు కోట్ల రూపాయల వ్యయంతో వసతిగృహ (రుబాత్) నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

23. షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల వారితో సమానంగా ముస్లిం, సిఖ్, దళిత క్రిస్టియన్ వర్గాలకు చెందిన పేద ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం ప్రభుత్వం ప్రారంభించిన 'షాదీ ముబారక్ పథకం' ప్రజల మన్ననలు అందుకున్నది. ముఖ్యంగా మైనారిటీ వర్గాల ప్రజలు ఈ పథకాన్ని కొనియాడారు. అధికారంలోకి వచ్చిన ఇంత తక్కువ సమయంలో ఏ ప్రభుత్వమూ మైనారిటీ ప్రజల కోసం ఇంత శ్రద్ధ తీసుకోలేదు. అర్హులైన ఆడపిల్లల బ్యాంకు ఖాతాల్లో ముహూర్తంరోజు కంటే ముందే 51,000 రూపాయలు జమచేసేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకున్నది. పెళ్లికాని ఆడబిడ్డల కోసం రూపొందించిన 'షాదీ ముబారక్' పథకం మేము వారికి ఇచ్చిన పెళ్లి కానుక. ఇంతే కాకుండా సభ్యుల కోరిక మేరకు రంజాన్, క్రిస్టమస్ పర్వదినాల సందర్భంగా రెండు రోజుల సెలవు కూడా ప్రకటించాము.

24. 2015-16 బడ్జెట్‌లో మైనారిటీ ప్రజల సంక్షేమం కోసం ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాల కింద 1,105 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాము.

### ఆసరా పింఛన్లు

25. 2014-15 బడ్జెట్ ప్రసంగంలో చెప్పినట్లు ఆసరా పింఛన్ల పథకం 2014 నవంబరు 8 నుండి ప్రారంభం అయింది. ఈ పథకం కింద

వృద్ధులు, వితంతువుల పింఛన్లను 200 రూపాయల నుండి 1,000 రూపాయలకు పెంచినం. వికలాంగుల పింఛన్లను 500 రూపాయల నుండి 1,500 రూపాయలకు పెంచినం.  వృద్ధాప్య, వితంతు పింఛన్ల పెంపువల్ల ప్రభుత్వంపై సంవత్సరానికి 4,000 కోట్ల రూపాయల భారం పెరిగింది.   ఆసరా పథకం తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ స్ఫూర్తికి మచ్చుతునక.  పేదల సంక్షేమమే  మా ప్రాధాన్యత క్రమంలో మొదటిదని ఏదైతే ప్రకటించామో దానికి కట్టుబడి ఆర్థికభారాన్ని కూడా లెక్క చేయకుండా నిస్సహాయులకు, పేదలకు బుక్కెడుబువ్వ పెట్టడానికి ప్రభుత్వం వారికి 'ఆసరా'గా నిలవడానికే ఈ పథకం.

26. రాష్ట్రంలో బీడీ కార్మికుల పరిస్థితి చాలా దయనీయంగా ఉన్నది. వారి పేదరికానికి ఆరోగ్య సమస్యలు కూడా తోడవుతున్నాయి. బీడీ కార్మికుల కష్టాలను మా ప్రభుత్వం అర్థం చేసుకున్నది.  వారికి ఈ నెల (మార్చి 2015) నుండి నెలకు 1,000 రూపాయలు ఆర్థిక భృతి మంజూరు చేయాలని నిర్ణయించినం.  రాష్ట్రంలో ఉన్న  బీడీ కార్మికులలో ఇప్పటికే కొంత మంది 'ఆసరా పింఛన్లు' పొందుతున్నారు.  మిగతా వారికి వెయ్యిరూపాయల చొప్పున బీడీ కార్మికుల  భృతి ఇవ్వాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. 2015-16 బడ్జెట్‌లో ఈ భృతి కోసం మొత్తం 188 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాం.

## మహిళా శిశు సంక్షేమం

27. మహిళలు, పిల్లలు మన సమాజంలో చాలా ముఖ్యమైన భాగం. సామాజికాభివృద్ధికి తోడ్పాటు నిచ్చేవారు మహిళలైతే, పిల్లలు మన సమాజపు భవిష్యత్తు. భావి తరాలు బాగుంటేనే సమాజం బాగుపడ్తుంది. వాళ్లు బాగుంటేనే సమాజం బాగున్నట్లు లెక్క. మహిళల సంక్షేమం, భద్రతకు భరోసా ఇవ్వాలని రాజ్యాంగం సూచిస్తున్నది. మహిళల పట్ల వివక్షచూపే సమాజాన్ని, వారికి భద్రతను కల్పించలేని సమాజాన్ని నాగరిక సమాజం అనలేం. దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అకృత్యాలు వింటుంటే సిగ్గు అనిపిస్తున్నది. మన రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితులను నివారించాలని, ఆరుగురు సభ్యులతో కూడిన మహిళా కమిటీని మన రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆడబిడ్డలు, మహిళల భద్రతకు భరోసాకై ఈ కమిటీ సూచనలు చేసింది. నిరంతర హెల్ప్‌లైన్, వన్‌స్టాప్ ఆశ్రయ కేంద్రాలు, మహిళల పోలీస్ స్టేషన్లు, కేసు విచారణను త్వరితగతిన పూర్తి చేయడం వంటివి కమిటీ సూచనలలో ముఖ్యమైనవి. కమిటీ సూచనల మీద మహిళల భద్రత కోసం అన్ని చర్యలు తీసుకున్నం. 'షీ-టీమ్స్' ని ఏర్పాటు చేసినం. ఈవ్‌టీజర్స్‌ని, మహిళలను వెంటబడి వేధించే వారిని 'షీ-టీమ్స్' చాలా చురుకుగా గుర్తించి పట్టుకుంటున్నాయి. మహిళలకు భద్రత అంశంలో చాలా పురోగతి సాధించాము.

28. గర్భిణీలకు, బాలింతలకు, శిశువులకు అంగన్‌వాడి కార్యకర్తలు, అంగన్‌వాడీ సహాయకులు అందిస్తున్న సేవలు ముఖ్యమైనవి. మహిళా శిశు సంక్షేమ శాఖలోని సమగ్ర శిశు సంక్షేమాభివృద్ధి సేవల (ఐ.సి.డి.ఎస్.)

పథకం కిందికి వీరు వస్తారు. పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించేది, ప్రీ–స్కూలు స్థాయి పిల్లలకు ఆటపాటలు నేర్పేది అంగన్‌వాడి కార్యకర్తలు, సహాయకులే. తల్లులకు పౌష్టికాహారం ప్రాధాన్యతను గురించి తెలియచేస్తూ, పిల్లలకు టీకాలు వేయడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి సహకరిస్తూ ఉంటారు. మొట్ట మొదటి సారి, అంగన్‌వాడి కార్యకర్తల సమావేశానికి స్వయంగా ముఖ్య మంత్రి గారు హాజరై వారి సమస్యలపై కూలంకషంగా చర్చించారు. పిల్లలకు అందించే ఆహారాన్ని వండడానికి కొన్ని చోట్ల అంగన్‌వాడి కార్యకర్తలు తమ పాత్రలను, సొంత గ్యాస్‌ను ఉపయోగిస్తున్న విషయం ఈ సమావేశంలో సానుభూతితో అర్థం చేసుకున్నారు. ప్రస్తుతం అంగన్ వాడి కార్యకర్తలకు 4,200 రూపాయలు, అంగన్ వాడి సహాయకులకు 2,450 రూపాయలు నెలసరి వేతనంగా చెల్లిస్తున్నారు. వారు నిర్వహిస్తున్న బాధ్యతలతో పోల్చితే, వారికి ఇప్పుడు ఇస్తున్న వేతనం చాలా స్వల్పం. వారి సమస్యలను సానుభూతితో అర్థం చేసుకున్న మా ప్రభుత్వం వారి జీతభత్యాలను పెంచాలని నిర్ణయించిన విషయం సభకు విన్నవించుకుంటున్నాను. అంగన్‌వాడి కార్యకర్తల నెల జీతాన్ని 4,200 రూపాయల నుండి 7,000 రూపాయలకు, అంగన్‌వాడి సహాయకుల నెల జీతాన్ని 2,450 రూపాయల నుండి 4,500 రూపాయలకు ఈ నెల అనగా మార్చి 2015 నుండి పెంచుతున్నాము. వంటపాత్రల కొనుగోలు కోసం ప్రతి అంగన్‌వాడి కేంద్రానికి 1,000 రూపాయల చొప్పున వన్ టైమ్ గ్రాంటుగా ఇవ్వాలని కూడా 2015–16 బడ్జెట్‌లో

ప్రతిపాదిస్తున్నాం. మహిళా, శిశు సంక్షేమంలో, ఆరోగ్యంలో కీలక పాత్ర వహించే అంగన్ వాడీలకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే అంతర్జాతీయ మహిళాదినోత్సవ కానుకగా దీన్ని భావించవచ్చు.

29. ఐ.సి.డి.ఎస్. స్కీము కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే తోడ్పాటు గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం సగానికి పైగా తగ్గింది. ఈ స్కీమ్ కింద 2014-15 బడ్జెట్ అంచనాలలో రాష్ట్రాలకు 17,858 కోట్ల రూపాయల కేంద్ర సహాయం అందగా, అది 2015-16 బడ్జెట్ అంచనాలలో 8,000 కోట్ల రూపాయలకు తగ్గడం గమనార్హం. దీనివల్ల మనరాష్ట్రంపై మరింత భారం పెరిగింది. అయినా మహిళ, శిశు సంక్షేమం పట్ల మా ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను ప్రదర్శిస్తూ, 2015-16 బడ్జెట్‌లో ఐ.సి.డి.ఎస్. స్కీముకు 771 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము. కేంద్రం నుంచి నిధుల సహాయం తగ్గినా, మహిళా సంక్షేమం పట్ల మా ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది మచ్చుతునక.

**ఆహారభద్రత**

30. ప్రతి వ్యక్తికీ చాలినంత ఆహారధాన్యాన్ని అందించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికీ ఆహారభద్రత కల్పించాలనేదే మా ప్రభుత్వ ఆశయం. అందుకే బియ్యం రాయితీ పొందే కుటుంబాల ఆదాయ పరిమితిని పెంచడం ద్వారా రాష్ట్రంలో ఎక్కువ కుటుంబాలకు అర్హత కల్పించాము. గ్రామీణ ప్రాంతాల్లో 60,000 రూపాయలుగా ఉన్న కుటుంబ వార్షిక ఆదాయాన్ని 1,50,000 రూపాయలకు పెంచాము. పట్టణ ప్రాంతాల్లో

75,000 రూపాయలుగా ఉన్న కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని 2,00,000 రూపాయలకు పెంచాము. కుటుంబ భూకమత పరిమితి తరి భూమి అయితే 2.5 ఎకరాల నుండి 3.5 ఎకరాలకు, ఖుష్కి భూమి అయితే 5.0 ఎకరాల నుండి 7.5 ఎకరాలకు పెంచాము. ఇంతకు ముందు మనిషికి ఒక నెలలో 4 కిలోల బియ్యంచొప్పున, కుటుంబానికి గరిష్టంగా 20 కిలోల బియ్యం ఇచ్చేవారు. ఇప్పుడు 'రూపాయికి కిలో బియ్యం' పథకం క్రింద మనిషికి నెలకు 6 కిలోల చొప్పున, గరిష్ట పరిమితి లేకుండా కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికీ ఇచ్చే వెసులుబాటును జనవరి 1, 2015 నుండి 2.8 కోట్ల మందికి కల్పించాము. తెలంగాణ ప్రభుత్వం ప్రతి మనిషికీ పట్టెడన్నం పెట్టాలనే ఉదాత్తభావనతో ఆహార భద్రత పథకాన్ని విస్తరించింది.

## వసతి గృహాలకు, పాఠశాలకు సన్న బియ్యం

31. సమానత్వ సాధన కోసం మరో విప్లవాత్మక నిర్ణయం తెలంగాణ ప్రభుత్వం తీసుకున్నది. అన్ని సంక్షేమ వసతి గృహాలకు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి జనవరి 1, 2015 నుండి సన్న బియ్యం సరఫరా చేస్తున్నాము. దీని వలన మన రాష్ట్రంలో గల 2,757 సంక్షేమ వసతిగృహలలో ఉన్న 4,80,926 మంది విద్యార్థులు మరియు 34,319 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న 29,86,010 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. ఈ నిర్ణయం సమాజంలోని అన్ని వర్గాల మన్ననలు అందుకున్నది. మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం ఇస్తున్నప్పటి నుండి, బడుల్లో పిల్లల హాజరు పెరిగింది. ఆహారభద్రత, ఆహారసబ్సిడీ కోసం

2015-16 బడ్జెట్‌లో 2,200 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నం. ఎన్నో సంవత్సరాలు గడిచాయి. ఎన్నో బడ్జెట్‌లు రూపొందాయి. కానీ వసతి గృహాల్లో పురుగులన్నం, నీళ్లచారు దుర్గతి తప్పలేదు. ఈ బాధలు నాజీవితంలో ప్రత్యక్షంగా అనుభవించిన వాణ్ణి నేను. మా ప్రభుత్వం, చదువుకునే పిల్లలు కడుపునిండా తినే అవకాశం ఇవ్వాలని సన్న బియ్యం పథకం చేపట్టింది. ఇన్నేళ్ళుగా వారికి అధ్వాన్నమైన ఆహారం పెట్టి గత పాలకులు చేసిన అన్యాయాన్ని సరిదిద్దింది.

## ఉద్యోగుల సంక్షేమం

32. ప్రభుత్వ లబ్ధిని పథకాలను ప్రజలకు అందించడంలో ఉద్యోగులదే కీలక పాత్ర. ఉద్యోగులతో స్నేహ సంబంధాలను కొనసాగించాలన్నదే మా ప్రభుత్వ విధానం. తెలంగాణ ఉద్యమంలో కూడా ఉద్యోగులు ఎన్నదగిన పోరాటం చేసారు. వారిని గౌరవిస్తూ 2014-15 బడ్జెట్ ప్రసంగంలో చెప్పినట్లే ఉద్యోగుల వేతనాల్ని సవరిస్తూ మునుపెన్నడూ, ఎవ్వరూ ఇవ్వనంత ఫిట్‌మెంట్‌ను ఇచ్చాము. ఉద్యోగుల ఆశలకనుగుణంగా 43 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించాము. 2015-16 బడ్జెట్‌లో జీతాలు, భత్యాల కోసం 22,889 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం, బంగారు తెలంగాణ సాకారం కోసం ఉద్యోగులు పునరంకితం కావాలి. మా ప్రభుత్వానికి వారిపట్ల ఆ విశ్వాసం ఉన్నది.

## వ్యవసాయం, అనుబంధ రంగాలు

33. జనాభాలో సగం మందికి వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయం దీని అనుబంధ రంగాల ఆదాయాలు 2014-15 రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జి.ఎస్.డి.పి.)లో 18 శాతం మాత్రమే. తెలంగాణలో వ్యవసాయం చాల ఖర్చుతో కూడిన వ్యవహారం. వ్యయం ఎక్కువ, ఆదాయం తక్కువ. దీనివల్ల వ్యవసాయ రంగం పెట్టుబడులను ఆకర్షించలేకపోతున్నది. వర్షపాతంలో అనిశ్చితి, భూగర్భ జలాల తరుగుదల, నీటి పారుదల సౌకర్యాల లేమి, ప్రతికూల వాతావరణ పరిస్థితులు వ్యవసాయ రంగాన్ని ఎదగకుండా చేస్తున్న అంశాలు. ఈ పరిస్థితులను మార్చాలని మా ప్రభుత్వం నిశ్చయించింది. యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకుంటున్నది. తక్షణ ఉపశమనానికై, రైతుల బ్యాంకు రుణ మాఫీ కోసం 4,250 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. దీనివల్ల వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో తిరిగి రుణాలు తీసుకునే వెసులుబాటు రైతులకు కలిగింది. 2015-16 బడ్జెట్‌లో రుణ మాఫీ కోసం 4,250 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము. రుణమాఫీ వలన వ్యవసాయ రంగంలో రైతుల పెట్టు బడులు తిరిగి ప్రారంభం కాగలవని ఆశిస్తున్నాము.

34. పండ్ల తోటలు, కూరగాయల సాగు, పూలసాగు (హార్టీకల్చరు) అభివృద్ధి వలన రైతుకు అధిక మరియు నిలకడైన ఆదాయం లభిస్తుంది. అందుకే హార్టికల్చర్ రంగాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నది. గ్రీన్ హౌజ్ సాగుకోసం 250 కోట్ల రూపాయలను

ప్రతిపాదిస్తున్నాము. గ్రీన్ హౌజ్‌ల ఏర్పాటు కోసం ప్రభుత్వం 75 శాతం సబ్సిడీగా ఇస్తుంది. సూక్ష్మ సేద్యాన్ని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. ఇందుకోసం ఈ బడ్జెట్‌లో 200 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము.

35. ఆధునిక సాంకేతిక మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడం వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ముఖ్యంగా పండ్లు, కూరగాయలు, పూలు సాగు చేసే రైతులు కష్టనష్టాల పాలవుతున్నారు. వ్యవసాయ మార్కెట్ రంగంలో సంస్కరణలకోసం ప్రభుత్వం రాష్ట్ర స్థాయి కమిటీని నియమించింది. కమిటీ తమ నివేదికను అక్టోబరు 2014లో ప్రభుత్వానికి సమర్పించారు. వారు చేసిన సిఫారసుల ప్రకారం మార్కెటింగ్ శాఖలో సంస్కరణలు చేపడుతున్నాము. వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో ఈ–టెండర్ల వేలం పద్ధతులను ప్రవేశ పెట్టాము. కూరగాయలకు పెరుగుతున్న డిమాండును బట్టి 'మన ఊరు–మన కూరగాయలు' అనే వినూత్న పథకం రూపుదిద్దుకున్నది. మార్కెటింగ్‌ను విస్తృతం చేయడం, ప్రజల చెంతకు చేర్చడం దీని ముఖ్యోద్దేశ్యం.

36. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు గిడ్డంగుల సౌకర్యాల కొరత ఉన్నది. నిల్వ సౌకర్యాల కొరతను పరిష్కరించడానికి రాష్ట్రంలో కొత్తగా 6.725 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. అందుకు 403.50 కోట్ల రూపాయలు వ్యయం

కాగలవని అంచనా. అలాగే నాబార్డు ఋణ సహాయంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాల వద్ద 9.10 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గిడ్డంగులను నిర్మిస్తున్నాము. ఇందుకోసం వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు ప్రణాళిక మరియు ప్రణాళికేతర వ్యయాల కింద 2015-16 బడ్జెట్‌లో 411 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము.

37. వెరసి మొత్తంగా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు 2015-16 బడ్జెట్‌లో 8,432 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము.

## పారిశ్రామిక అభివృద్ధి

38. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచడానికి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి పారిశ్రామికీకరణే మార్గం. 'పరిశోధనల నుండి ఆవిష్కరణలు, ఆవిష్కరణల నుండి పరిశ్రమలు, పరిశ్రమల నుండి అభ్యుదయం' అన్నదే మా సూత్రం. 'ఇన్నోవేట్, ఇంకుబేట్, ఇన్‌కార్పోరేట్' అన్నదే తెలంగాణ పారిశ్రామిక విధానం. ప్రగతి, భద్రత, ప్రశాంతతలతో అభివృద్ధి పథంలోకి అడుగుపెట్టేందుకు తగిన వాతావరణాన్ని కల్పించే మౌలిక సూత్రంతో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక విధానాన్ని రూపొందించాము. పారిశ్రామికీకరణ ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేర్చాలన్నదే మా లక్ష్యం.

39. ఉన్న పరిశ్రమలను సుస్థిరం చేయడంతో పాటు, పారిశ్రామిక రంగంలో జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించాలన్నదే మా

ప్రభుత్వ ఉద్దేశం. యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువ కల్పించగలిగేది తయారీ (మానుఫాక్చరింగ్) రంగం. అందుకే తయారీ రంగ పరిశ్రమల మీద ఎక్కువ దృష్టిని పెడుతున్నాము. దీనివల్ల, ఉత్తమ నాణ్యత గల వస్తువులు, పోటీధరల్లో (తక్కువ ధరల్లో) వినియోగదారుడికి లభిస్తాయని కూడా మేము ఆశిస్తున్నాం. 'మేడ్-ఇన్-తెలంగాణ, మేడ్-ఇన్-ఇండియా' అన్న నినాదంతో మన ఉత్పత్తులు జాతీయ, అంతర్జాతీయ మన్ననలు అందుకోవాలన్నది మా ఆకాంక్ష. ఈ మొత్తం విధానంలో ఏ స్థాయిలోను అవినీతిని, అక్రమాలను ఉపేక్షించబోమని, సభకు విన్నవించుకుంటున్నాము.

40. ప్రపంచ ప్రమాణాలకు దీటైన వాతవరణాన్ని కల్పిస్తూ పరిశ్రమలను ప్రోత్సహించడం తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక విధానం. దీనిని ఆచరణలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన టీ.ఎస్.-ఐపాస్ (తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ప్రాజెక్టు ఆమోదం మరియు స్వీయధృవీకరణ పద్ధతి)ని గత అసెంబ్లీ సమావేశాల్లోనే ఏకగ్రీవంగా ఆమోదించి చట్టబద్ధత కల్పించిన విషయం గౌరవ సభ్యులకు తెలుసు. పరిశ్రమలకు అవసరమైన అన్ని అనుమతులు ఏకగవాక్ష (సింగిల్-విండో) పద్ధతిన ఇచ్చే వెసులుబాటును టి.ఎస్.-ఐపాస్ చట్టం కల్పిస్తున్నది. అన్ని అంశాలలోను స్వీయ ధృవీకరణ చేసే సౌకర్యం ఈ విధానంలోని మరో ప్రత్యేకత. పరిశ్రమ స్థాపనకు అవసరమైన అన్ని అనుమతులూ 30 రోజుల్లోగా ఇవ్వాలని చట్టం నిర్దేశిస్తున్నది. మెగాప్రాజెక్టులకు, వ్యూహాత్మక ప్రాజెక్టులకు 15 రోజుల్లోనే అనుమతులు ఇస్తారు. మన పారిశ్రామిక విధానం విశిష్టమైనది,

వినూత్నమైనది, దేశంలోనే అత్యుత్తమమైనది అని చెప్పేందుకు గర్విస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రి చెప్పినట్లు, టి.ఎస్.-ఐపాస్ విధానం అంటే 'సింగిల్ విండో - వితౌట్ గ్రిల్స్'.

41. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలలో వ్యవస్థాపకతను ప్రోత్సాహించాలన్నది తెలంగాణ పారిశ్రామిక విధానంలోని మరో విశిష్టత. వ్యవస్థీకృత అవాంతరాలను అధిగమిస్తూ దళితుల్లో వ్యవస్థాపకతను ప్రోత్సాహించేందుకు టి.ఎస్.-ప్రైడ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటున్నది. దళితుల నుంచి, గిరిజనుల నుంచి పెద్దఎత్తున పారిశ్రామిక వేత్తలు ఎదగాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ చర్య తీసుకుంటున్నది.

42. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలో సాగుకు పనికిరాని భూమి 20 లక్షల ఎకరాలు ఉంది. అందులో పరిశ్రమలకు అనువైన భూమిని గుర్తించి, పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తాము. 2015-16 సంవత్సరంలో హైదరాబాదు-వరంగల్ పారిశ్రామిక కారిడార్, వరంగల్‌లో వస్త్రోత్పత్తి పరిశ్రమ, క్రొత్తగా ఏర్పడే ఫార్మాసిటీ, ఇండస్ట్రియల్ పార్క్‌లకు అనుసంధానంగా మినీ పారిశ్రామిక టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చిన ఉత్సాహవంతులైన దళితులకు ఋణ సౌకర్యం కల్పించి ప్రోత్సహిస్తాము. అంతర్జాతీయ విమానాశ్రయానికి, హైదరాబాదు ఔటర్ రింగ్ రోడ్‌కు కేవలం 30 నిమిషాల ప్రయాణ దూరంలో ఉన్న ముచ్చర్ల

గ్రామంలో 11,000 ఎకరాల్లో ఫార్మా సిటీని అభివృద్ధి చేస్తాము. ఇక్కడి మందుల పరిశ్రమలను అంతర్జాతీయ ప్రమాణాలతో, కాలుష్య నియంత్రణ సమర్థవంతంగా జరిగే విధంగా ఏర్పాటు చేస్తాము.

43. 2015-16 బడ్జెట్‌లో పారిశ్రామికాభివృద్ధి కోసం 973.74 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాం.

## విద్యుత్

44. తెలంగాణ రాష్ట్రం విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్న విషయం గౌరవ సభ్యులకు తెలుసు. నిలకడైన వ్యవసాయ ఉత్పాదనకు, పారిశ్రామికాభివృద్ధికీ, చాలినంత విద్యుత్ సరఫరా ఉండడం అవసరం. అన్ని రకాల వినియోగదారులకు సరిపోయినంత, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ప్రభుత్వం నిశ్చయించింది. ముఖ్యంగా రాష్ట్రంలోని 19.53 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు రోజుకు ఏడు గంటల పాటు విద్యుత్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

45. సంప్రదాయ విద్యుత్‌తో పాటు సోలార్ విద్యుత్‌ను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. 500 మెగావాట్ల సామర్థ్యంగల సోలార్ విద్యుత్ ప్లాంటుల స్థాపన కోసం బిడ్‌లను ఆహ్వానించాము. సంప్రదాయేతర ఇంధన వనరుల స్థాపనకు కేంద్ర సబ్సిడీకి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 20 శాతం సబ్సిడీ ఇస్తూ, గృహావసరాలు తీర్చేందుకు 1 కిలో వాటు సామర్థ్యంగల 4,000 సోలార్ విద్యుత్ ప్లాంట్లను ప్రోత్సహిస్తాము. ఆఫ్‌గ్రిడ్ పద్ధతిన వీటిని నిర్వహిస్తారు.

46. తక్షణ విద్యుత్ కొరతను తీర్చేందుకు, రాష్ట్ర ప్రభుత్వం ఛత్తీస్‌గడ్ రాష్ట్ర ప్రభుత్వంతో 1,000 మెగావాట్ల విద్యుత్ సరఫరా కోసం ఒప్పందం చేసుకున్నది. 2018 నాటికి విద్యుత్ రంగంలో మనది మిగులు రాష్ట్రం అవుతుంది. కోతల్లేని విద్యుత్ సరఫరాను చూస్తాము. మన పిల్లలకు 'విద్యుత్ కోత' (పవర్ కట్) అంటే ఏమిటో కూడా తెలియని స్థితి ఉంటుందని ఆశిస్తున్నాను.

47. రాష్ట్రంలో ప్రస్తుత విద్యుదుత్పత్తి సామర్థ్యం 4,320 మెగావాట్లుగా ఉన్నది. తెలంగాణ రాష్ట్రాన్ని మిగులు విద్యుత్తు రాష్ట్రంగా తయారు చేయడానికి 2018 సంవత్సరానికి 23,675 మెగావాట్ల విద్యుదుత్పత్తిని పెంచాలని ప్రతిపాదించినం. తెలంగాణ రాష్ట్ర జెన్‌కో ద్వారా 6,000 మెగావాట్లు, సింగరేణి కాలరీస్ ద్వారా 2,000 మెగావాట్లు మరియు జాతీయ థర్మల్ పవర్ సంస్థ (ఎన్.టి.పి.సి.) ద్వారా 4,000 మెగావాట్ల అదనపు విద్యుత్ ఏర్పాటు సామర్థ్యం కోసం ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగింది. 2014-15 రాష్ట్ర బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా, ఇ.పి.సి. ప్రాతిపదికపై 6,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడానికి తెలంగాణ జెన్‌కో, బి.హెచ్.ఇ.ఎల్. సంస్థతో ఒక అవగాహనా ఒప్పందాన్ని ''జీ టూ జీ (G to G) పద్ధతిలో కుదుర్చుకుంది. ప్రైవేటు కార్పోరేట్ల ఆధిపత్యంలో కాకుండా, ఈ విధానం ప్రజల ప్రయోజనాలను నెరవేరుస్తుందని భావిస్తున్నాము. ఈ నిర్ణయం దేశ ప్రధాని ప్రశంసలు కూడా పొందింది అని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను.

48. 2015-16 బడ్జెట్‌లో విద్యుత్ రంగానికి 7,400 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము.

## ఇరిగేషన్

49. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లే గోదావరి, కృష్ణానదీ జలాలను సద్వినియోగం చేయడం విషయంలో ప్రభుత్వం ధృఢ సంకల్పంతో ఉన్నది. అందుకే పాలమూరు ఎత్తి పోతల పథకాన్ని, నక్కలగండి ప్రాజెక్టులను చేపట్టాలని ఈ బడ్జెట్‌లో కొత్తగా ప్రతిపాదిస్తున్నాం. పాలమూరు ప్రాజెక్టు హైదరాబాదు నగరానికి తాగునీరు అందించడమే కాక, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలలో 10 లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందిస్తుందని అంచనా. ఈ ప్రాజెక్టుకు పాలనాపరమైన అనుమతిని కూడా ఇచ్చేసినం. నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు, మహబూబ్‌నగర్ జిల్లాలలోని దుర్భిక్ష ప్రాంతాలకు మొత్తంగా 3 లక్షల 40 వేల ఎకరాల భూమికి నక్కలగండి ప్రాజెక్టు ద్వారా తాగు మరియు సాగునీరు అందుతుంది. వర్షాకాలంలో 51 టి.ఎం.సి.ల నిల్వ చేసుకొనే సామర్థ్యం గల రెండు రిజర్వాయర్లను నిర్మించాలని కూడా నిర్ణయించినం. వీటిలో ఒకటి తడకపల్లిలో మరియు రెండవది పాములపర్తిలో నిర్మించదలిచాము.

50. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో లక్ష ఎకరాల భూమికి సాగునీటి సౌకర్యం కల్పించాలన్నది మా ప్రభుత్వ లక్ష్యం. మిషన్ కాకతీయతో కలిపి,

ఇతర సాగు నీటి ప్రాజెక్టులన్నింటికీ 2015-16 వార్షిక ప్రణాళికలో 8,500 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము.

## మిషన్ కాకతీయ

51. రాజుల కాలంలోనే తెలంగాణలో దశబంధ చెరువుల విధానం ఉండేది. కాకతీయుల కాలంలోనే పేరెన్నికగన్న చెరువులు నీటిపారుదలకు ప్రధాన వనరులుగా ఉండేవి. ఒక్కప్పుడు ఊరి ఆదరువుగా, ఊరి జీవనవిధానానికి జీవధాతువుగా పల్లెలపాలిట నీటిపుట్టలుగా చెరువులు ఉన్నాయి. తెలంగాణలో మేజర్ ఇరిగేషన్ వనరులయిన చెరువులు ఉమ్మడి రాష్ట్రంలో మైనర్ ఇరిగేషన్ పేరుతో కుచించుకపోయి కునారిల్లిపోయే స్థితి దాపురించింది. చెరువుల వైభవం తగ్గిన కొద్దీ ఆ చెరువుపై ఆధారపడిన ఊరు, సకల వృత్తులూ, వ్యవసాయము శిథిలమౌతూ వచ్చాయి. తెలంగాణ పల్లెలకు మళ్ళీ జవజీవాలు తెచ్చేందుకు చెరువుల పునరుద్ధరణకై తెలంగాణ ప్రభుత్వం నడుంకట్టింది. చెరువును బతికించి తద్వారా పల్లెలను బతికించే ఈ పునర్నిర్మాణానికి మిషన్ కాకతీయ అని పేరు పెట్టి ఒక మహా సంకల్పానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చెరువు బాగుంటే ఊరు బాగుంటుంది. సకల వృత్తులూ పునరుజ్జీవనం పొందుతాయి. మత్స్యకారుల ఉపాధి అవకాశాలు మెరుగ వుతాయి. వనరుల వల్ల భూగర్భ జలాలు పెరిగి, పచ్చని ప్రాంతాలుగా పల్లెలు మారుతాయి.

52. 2014–15 కాలంలో 9,305 చెరువుల పునరుద్ధరణను చేపట్టాం. 1835.42 కోట్ల అంచనా వ్యయంలో 5,761 చెరువులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 475 చెరువులకు టెండర్లను పిలిచాం. మిగతా చెరువులకు కూడా 2015 మార్చిలోగా టెండర్ల ప్రక్రియ పూర్తవుతుంది. 2015–16 కాలంలో 9,308 చెరువుల పునరుద్ధరణ చేపడతాము. ఇందుకు గాను 2015–16 బడ్జెట్‌లో మిషన్ కాకతీయతో పాటు ముఖ్య ఇంజినీర్, చిన్న నీటి పారుదల శాఖతో కలిపి 2,083 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము. ఈ పథకాలకు కావలసిన నిధులను నాబార్డు మరియు ఇతర బ్యాంకుల ద్వారా కూడా సమీకరించడం జరుగుతుంది.

## రహదారుల అభివృద్ధి

53. రవాణా సౌకర్యానికి రోడ్లు ఎంతో అవసరం. రైలు మార్గ సౌకర్యం అంతంత మాత్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు రవాణా మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నది. కాని, రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. రాష్ట్ర ఆర్థిక స్థితి మెరుగుపర్చడానికి చక్కటి రహదారులు అవసరం. రహదారుల అభివృద్ధి ద్వారా ప్రాంతాలు అనుసంధానం అవుతాయి. ఆధునిక నాగరిక ప్రపంచంలో రహదారుల అభివృద్ధి ప్రాముఖ్యత ఉన్నది. అందుకే రాష్ట్రంలోని రోడ్ల పునరుద్ధరణను, నవీకరణను మా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నది. దీనిని సమయానికి పూర్తిచేయాలని నిశ్చయించినం. ఈ కార్యక్రమం కింద అన్ని మండల కేంద్రాలను డబల్ రోడ్లతో అనుసంధానిస్తం. ఇప్పుడున్న కంకర రోడ్లను, డాంబర్ రోడ్లుగా నవీకరిస్తాం. 2015–16 బడ్జెట్‌లో ప్రణాళిక,

ప్రణాళికేతర వ్యయం కింద రోడ్ల నిర్వహణ, నవీకరణల కోసం రోడ్లు భవనాల శాఖకు 4,980 కోట్ల రూపాయలను, పంచాయతీరాజ్ శాఖకు 2,421 కోట్ల రూపాయలను ప్రతిపాదిస్తున్నాము.

## వాటర్ గ్రిడ్

54. ప్రపంచంలో చాలా రోగాలు నీటి మూలంగానే వస్తాయని అనేక పరిశోధనలు తేల్చాయి. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించడం ప్రభుత్వాల ప్రథమ బాధ్యత. తెలంగాణ ఉద్యమ సందర్భంలో నల్లగొండ జిల్లా ప్రజల కాలొంకర, చెయ్యొంకరకు కారకమైన ఫ్లోరైడ్ అతి పెద్ద సమస్యగా ముందుకు వచ్చింది. మంచినీటిని మారుమూల గ్రామాలకూ, నిర్లక్ష్యానికి గురైన తండాలకు జలప్రవాహంగా అందించడానికి 'వాటర్ గ్రిడ్' ప్రాజెక్టు రూపొందించాం. రాబోయే నాలుగేళ్ళలో తెలంగాణలో ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇవ్వకుంటే మళ్లీ ఓటు కూడా అడగమని మన ముఖ్యమంత్రిగారు సాహసోపేతంగా ప్రకటించారు. ప్రపంచంలోనే అత్యంత భారీగా రూపొందిస్తున్న ఈ పథకం ద్వారా ప్రజలకు మంచినీరు అందించడం తక్షణ ప్రయోజనం అయితే, జనం రోగాల బారిన పడకుండా కాపాడటం దీర్ఘకాలిక లక్ష్యం. ఈ పథకానికి 2015-16 బడ్జెట్‌లో 4,000 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాం.

## ఆరోగ్యం

55. అధ్యక్షా, మానవాభివృద్ధి కొరకై ప్రజా ఆరోగ్యం మీద ఖర్చు చేసే ప్రతి పైసా కూడా అర్థవంతమైన పెట్టుబడి అని మా ప్రభుత్వం దృఢ

నమ్మకంతో ఉన్నది. ఈ సంవత్సరం కూడా హైదరాబాదు, జిల్లా కేంద్రాలు మరియు ఏరియా ఆసుపత్రులన్నింటినీ బలోపేతం చేయడానికి, ఆధునికీకరించడానికి మా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. స్వైన్ ఫ్లూ వ్యాధి వల్ల కలిగే మరణాలను నివారించేందుకు అన్ని జిల్లా కేంద్రాలు మరియు ఏరియా ఆసుపత్రుల్లో స్వైన్ ఫ్లూ చికిత్సా కేంద్రాల్ని స్థాపించాము. తెలంగాణలోని అన్ని ఆసుపత్రుల్లో ఉన్న స్వైన్ ఫ్లూ వ్యాధిగ్రస్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడమే కాకుండా, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉన్న రోగులకు కూడా నారాయణగూడలోని ఐ.పి.యం.లోనూ మరియు నల్లకుంటలో ఉన్న ఫీవర్ ఆసుపత్రులో కూడా ఉచిత పరీక్షల నిర్వహణకై తగు చర్యలు చేపట్టాం.

56. అధ్యక్షా, అంతేకాకుండా మా ప్రభుత్వం 108 అంబులెన్స్ సేవలను బలోపేతం చేయడానికి కృతనిశ్చయంతో ఉందని తెలియ జేస్తున్నాను. ఇందులో భాగంగా వీటి సంఖ్యను 337 నుంచి 506కు పెంచుతున్నాము. అలాగే మా ప్రభుత్వం మారుమూల ప్రాంతాలలోని గిరిజన వాడల, గూడాల ప్రజల అత్యవసర అవసరాలను తీర్చడానికి 104 సర్వీసులను మెరుగుపరచడానికి నిర్ణయించాం. సంచార ఆరోగ్య యూనిట్లను అవసరమైన చోట్ల పెంచడానికి సంకల్పించినం.

57. అధ్యక్షా, 2015-16 సంవత్సరానికి గాను వైద్యఆరోగ్య సేవల కోసం 4,932 కోట్లు కేటాయించడం జరిగింది.

## విద్య

58. పెరుగుతున్న ఆర్థిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగుపరచడం కోసం విద్యా రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి ఉద్యోగావకాశాలను పెంపొందించడానికి నిర్ణయించాము. తెలంగాణ సంస్కృతి, చరిత్ర, భాషలు ప్రతిబింబించే విధంగా పాఠశాల పాఠ్య ప్రణాళికల్ని మార్చడానికి ఈ సంవత్సరం ప్రతిపాదిస్తున్నాం. జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి సూచనల మేరకు ఉపాధ్యాయ విద్య కార్యక్రమంలో భాగంగా కొత్త డిప్లమా కోర్సులను ప్రారంభించడం జరిగింది. కేజి టూ పీజి పథకాన్ని పూర్తి సమగ్ర పరిశీలన, పరిశోధన తరువాత అమలులోకి తీసుకురావాలని భావిస్తున్నాం. ఇందుకు అవసరమైన మేథోమథనం వివిధ స్థాయిల్లో జరుగుతున్నది. ఒక రూపం వచ్చిన తరువాత ఈ ప్రతిష్ఠాత్మక పథకం ప్రారంభమవుతుంది.

59. గత చాలా ఏళ్లుగా విశ్వవిద్యాలయాలకు సంబధించిన బ్లాక్ గ్రాంట్లు ఏమాత్రం పెంపుదలకు నోచుకోకుండా వదిలివేయబడ్డాయి. చారిత్రాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థులను ఎందరినో ఆకర్షిస్తున్నప్పటికీ కూడా గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విశ్వవిద్యాలయాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేయడం జరిగింది. ఈ విషయంలో మా ప్రభుత్వం చొరవ వహించి అక్కడ మంచి పరిపాలనను నెలకొల్పడమే కాకుండా, తగిన రీతిన బ్లాక్ గ్రాంట్లు పెంచుటకు చర్యలు తీసుకొన్నది. దీనిలో భాగంగా 238 కోట్ల రూపాయలను ప్రతిపాదించాం. ఇంతే కాకుండా కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీ పి.వి. నరసింహా రావు తెలంగాణ రాష్ట్ర

పశువైద్య విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయాలతో పాటు ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాల అభివృద్ధికి మా ప్రభుత్వం ప్రాముఖ్యతనిస్తూ 261 కోట్ల రూపాయలు ప్రతిపాదించాం.

60. 2015-16 సంవత్సరానికిగాను మొత్తం విద్యా రంగానికి బడ్జెట్ అంచనాలో రూ.11,216 కోట్లు కేటాయించడం జరిగింది.

## పోలీస్, ప్రజా రక్షణ మరియు భద్రత

61. దేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి కృతనిశ్చయంతో ఉన్నాం. నేరాల్ని అరికట్టడం ద్వారా ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడం మన ప్రథమ కర్తవ్యమని గౌరవ సభ్యులు అందరికీ తెలియజేస్తున్నాం. ఇందువల్ల దేశీయంగానే కాకుండా విదేశీ పెట్టుబడులు కూడా ఆకర్షించబడి రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం మరియు నిఘాను పెంచడం చాలా అవసరం. ప్రస్తుత సంవత్సరంలో హైదరాబాదు మరియు సైబరాబాదు జంట పోలీసు కమీషనరేట్స్‌లకు 4,433 వాహనాలు కొనుగోలు చేయడానికిగాను రూ.271 కోట్లను మంజూరు చేశాము. ఇందులో 3,883 అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వాహనాలు కొన్నాం. ఇంకా మిగిలిన 9 జిల్లాల్లో కొన్న కొత్త వాహనాల సంఖ్య 550. ఫిర్యాదు అందిన వెంటనే సంఘటనా స్థలానికి 10 నిమిషాల్లో చేరుకునేటట్లు సైబరాబాదు పోలీసులకు 1,500 మోటారుసైకిళ్లు ఇవ్వడం జరిగింది.

గతంలో ఇది ఎప్పుడూ లేదు. చాలా పోలీసు స్టేషన్లు సౌకర్యాల కొరతతో సతమతమౌతున్నాయి. మా ప్రభుత్వం నగర పోలీసు స్టేషనులకు 75,000 రూపాయల చొప్పున, జిల్లా కేంద్రాలలో ఉన్న పోలీసు స్టేషన్లకు 50,000 రూపాయల చొప్పున మరియు గ్రామాలలోని పోలీసు స్టేషన్లకు 25,000 రూపాయల చొప్పున నెలవారీ ఖర్చుల కోసం కేటాయించడం జరిగింది. స్మార్ట్ పోలీసు వ్యవస్థ ఆధునిక ప్రపంచంలో అవశ్యకం. కనుక పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం, సాంకేతిక హంగులు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తూ ఉన్నది.

62. అధ్యక్షా, మా ప్రభుత్వం సేఫ్ సిటీ కార్యక్రమం క్రింద ఒక లక్ష సి.సి. కెమేరాలను హైదరాబాదు నగరంలో ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ కెమేరాలన్నీ ప్రతిపాదించిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం అయివుంటాయి. హైదరాబాదు పోలీసు విభాగం ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన 38 రకాల జరిమానాలను చెల్లించడానికి ఈ–చలానా విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఈ విధానాన్ని వాహన యజమానులు స్వాగతించారు. హైదరాబాదు, సైబరాబాదుల్లోని అన్ని పోలీసు స్టేషన్లలో ఆధునిక సౌకర్యాలతో కూడిన స్వాగత–సహాయ కేంద్రాలను నెలకొల్పడం జరుగుతున్నది. ఈ విధానం వల్ల పోలీసు విభాగం పనితీరు మెరుగుపడి ప్రజలకు పోలీసులకు మధ్య మంచి అవగాహన పెరుగుతున్నది.

## అడవులు మరియు పర్యావరణం

63. ఈ సంవత్సరం చేపట్టిన 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమం చెప్పుకోతగ్గ అభివృద్ధిని సాధించింది. 2015-16 సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేస్తాం. 2015-16 సంవత్సరంలో 3,300 నర్సరీలను గుర్తించి, వాటిలో 41 కోట్ల మొక్కలను ఉత్పత్తి చేయాలని నిర్ణయించాం. మొక్కలు పెంచే కార్యక్రమం దిశగా మొక్కలు నాటడం, వాటి సంరక్షణ తదితర అంశాల మీద ప్రజల్లో అవగాహన పెంచడానికి 2015, జూలై నెలలో ఒక వారం పూర్తిగా కేటాయించదలిచినాం. 2015-16 బడ్జెట్‌లో 'హరితహారం'కు రూ.325 కోట్లు ప్రతిపాదించడం జరిగింది.

## పట్టణాభివృద్ధి

64. అధ్యక్షా, హైదరాబాదు నగరం మన రాష్ట్రానికి తలమానికం. ఈ నగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నది. క్రిష్ణా మూడో దశ ద్వారా తక్షణమే తొంభై యం.జి.డి.ల నీరు తేవడం జరుగుతున్నది. గోదావరి నీటి పథకం ద్వారా 170 జి.యమ్.డి. ల నీటిని ఈ సంవత్సరాంతం లోగా నగరానికి చేర్చి శివారు ప్రాంతాలలో కూడా తాగునీటి సరఫరా మెరుగు పరుస్తున్నం. అదే విధంగా రాష్ట్రంలోని మిగతా మున్సిపాలిటీలలో కూడా నిర్దేశిత వాటర్ గ్రిడ్ ద్వారా పుష్కలంగా త్రాగు నీరు సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతున్నాయి. నగరంలో రోడ్ల అభివృద్ధి మరియు ఆకాశ మార్గాల (Skyways) ఏర్పాటుకు 1,600 కోట్ల రూపాయలు ప్రణాళిక

తయారు చేయబడినది. ఇందులో భాగంగానే మా ప్రభుత్వం జి.హెచ్.యం.సి, హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్.యం.ఆర్), హైదరాబాద్ మంచినీటి సరఫరా మరియు మురుగునీటి బోర్డులకు సహాయం అందజేస్తుంది. షెడ్యూలు ప్రకారం హైదరాబాద్ మెట్రో రైలు పథకం 2017 జులై నాటికి పూర్తి కావలసివుంది. 2015-16 ప్రణాళిక బడ్జెట్‌లో జి.హెచ్.యం.సి.కి రూ.526 కోట్లు, హెచ్.ఎం.ఆర్.కు రూ.416 కోట్లు మరియు హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్. అండ్ ఎస్.బి.కి రూ. 1,000 కోట్లు ప్రతిపాదించాం.

## సాంస్కృతిక మరియు పర్యాటక రంగం

65. తెలంగాణ రాష్ట్రానికి గొప్ప సంస్కృతి ఉన్నప్పటికీ కూడా సాంస్కృతిక పరంగా తెలంగాణ రాష్ట్రం అణచి వేతకు గురై ఒక రకంగా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు గట్టి బీజాలనే వేసింది. శాతవాహనుల కాలంనుండి మొదలుకొని రాష్ట్రకూటులు, కాకతీయులు, కుతుబ్‌షాహీలు మరియు అసఫ్‌జాహీల ఏలుబడిలో తెలంగాణ ఒక గొప్ప సాంస్కృతిక కేంద్రంగానే ఎదిగింది.

66. యాదగిరి గుట్టలో మరియు దాని చుట్టు ప్రక్కల ప్రాంతాలలో విస్తరించినటువంటి జైన, హిందు చారిత్రక ప్రదేశాలెన్నో అశ్రద్ధ చేయబడ్డాయి. హైదరాబాదు సమీపంలో గల ఈ సుప్రసిద్ధ క్షేత్రాల అభివృద్ధి కోసం 'యాదగిరి గుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ' అనే సంస్థను ఏర్పాటు చేసుకున్నాం. ఇందుకోసం రూ.100 కోట్లు మంజూరు

చేసాం. ఇదే విధంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా రూ.100 కోట్లు ప్రతిపాదిస్తున్నాం.

## బడ్జెట్ అంచనాలు

67. అధ్యక్షా, మా ప్రభుత్వం 2015-16 సంవత్సరానికి గాను ప్రణాళిక వ్యయం క్రింద రూ.52,383 కోట్లు, ప్రణాళికేతర వ్యయం క్రింద రూ.63,306 కోట్లు కలిపి మొత్తం రూ.1,15,689 కోట్లు ప్రతిపాదిస్తున్నాం. ఆర్థిక మిగులుగా రూ.531 కోట్లు, ద్రవ్య లోటుగా రూ.16,969 కోట్లు అంచనా. జి.ఎస్.డి.పి.లో ద్రవ్య లోటు 3.49 శాతంగా అంచనా. 2014-15తో పోల్చితే ఉద్యోగుల జీతభత్యాల పెంపుదల వలన ఈ సంవత్సరం ప్రణాళికేతర వ్యయం 2014-15 కంటే గణనీయంగా పెరిగింది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే పన్నుల రాబడులలో వాటా శాతం 32 నుండి 42 వరకు పెంచినప్పటికీ, మన రాష్ట్రానికి కేంద్రం ఇచ్చే ప్రణాళిక నిధుల శాతం తగ్గించడం వలన 2015-16 సంవత్సరపు ప్రణాళిక వ్యయం పెంచడానికి మా ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలిసి వచ్చింది. 2015-16 ఆర్థిక సవంత్సరానికి గాను కేంద్రం నుంచి మనకు పన్నుల రాబడి రూ.12,823 కోట్లు మాత్రమే. 2014-15 సంవత్సరంలో కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్ల మొత్తాన్ని రూ.3,14,814 కోట్ల నుండి 2015-16 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1,80,293కు తగ్గించింది. తదనుగుణంగా కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే ప్రణాళిక నిధులు 2014-15 బడ్జెట్ అంచనా రూ.11,781 కోట్లతో పోలిస్తే 2015-16

ఆర్థిక సంవత్సరానికి రూ.6,497 కోట్లు మాత్రమే. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చే నిధుల శాతం తగ్గించినప్పటికి మా ప్రభుత్వం అధిక మొత్తంలో ప్రణాళిక వ్యయాన్ని ప్రతిపాదిస్తుంది.

68. కేంద్ర ప్రభుత్వం తన 2015-16 బడ్జెట్ ప్రతిపాదనలలో జి.డి.పిలో 3.9 శాతం ద్రవ్య లోటుగా చూపిస్తూ రాష్ట్రాలకు వారి జి.ఎస్.డి.పిలో 3 శాతానికి ద్రవ్య లోటును పరిమితం చేయడం విచిత్రమైన విషయం. 14వ ఆర్థిక సంఘం రాష్ట్రాలలో బారోయింగ్ లిమిట్‌ను కొన్ని నిబంధనలకు లోబడి జి.ఎస్.డి.పి.లో 3.5 శాతానికి పెంచినప్పటికి, నేటివరకు కేంద్ర ప్రభుత్వం ఈ సిఫార్సుపై ఏవిధమైన నిర్ణయం తీసుకోలేదు.

అధ్యక్షా!

69. 'వెయ్యి మైళ్ల దూరాన్ని చేరుకోవాలనే లక్ష్యాన్ని మొదటి అడుగుతోనే ప్రారంభించాలి' అన్నది లోకోక్తి. 'బంగారు తెలంగాణ' ను సాధించే క్రమంలో మా ప్రభుత్వం అనేక వ్యయప్రయాసలు ఉన్నప్పటికీ దృఢంగా, వడివడిగా ప్రయాణం ప్రారంభించింది. మా ముఖ్యమంత్రి గారు గమ్యాన్ని చేరుకోనేవరకు ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ వెనుతిరిగి చూడరు. ఇది చరిత్ర నిరూపించిన సత్యం. అధ్యక్షా, మా ప్రభుత్వం చేతల ప్రభుత్వం. గత తొమ్మిది నెలల అతి తక్కువ కాలంలో మా ప్రభుత్వం అనుసరించిన విధానం తెలంగాణ రాష్ట్ర ప్రజల అబివృద్ధి పట్ల

మా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రతిబింబిస్తున్నది.  నేను ఈ బడ్జెట్‌ను సభ ఆమోదం కోసం ప్రవేశపెడుతున్నాను.

//జై తెలంగాణ  జైజై తెలంగాణ//